# డబల్ మర్డరు

ముదిగంటి సుజాతారెడ్డి

**వరలక్ష్మి, ప్రసాదరావు దంపతులను హత్య చేసినవాడు దొరికాడట!... పొద్దున్నే వార్త ఆమ్లంలా బుసబుసమని పొంగి పాకింది. వీధంతా ప్రసాదరావు ఇంటిముందే... ఎంత జనం! పొద్దెక్కినా కదలడంలేదు. ఆఫీసులకు పోకుండా, పనులు వదిలిపెట్టి... ఎంత జనం. గుంపులు గుంపులుగా... ఒకరి మీద ఒకరు పడిపోతూ- భుజాలు భుజాలు రాసుకొని తోసుకుంటూ.**

ఏడి హంతకుడు? తీసుకొచ్చారా?

పోలీసుల జీపులు రెండు. టకటకమని బూట్ల చప్పుడు. లాఠీల టకటకలు. పోలీసుల ముఖాలు గంభీరంగా బిగుసుకుపోయి.... భయంకరంగా- జనం భయంగా దూరంగా... దూరంగా సముద్రం అలల్లా ముందుకు దూకుతూ- లాఠీలను లెక్కచేయకుండా.... వాళ్ళనాపడం అసాధ్యమైపోయింది.

ఏడి హంతకుడు ఎక్కడ? కనపడడేమిటి?

లాఠీల దెబ్బలకు జడిసి వెంటనే దూరం దూరంగా... మళ్ళా వెంటనే అలల్లా విరుచుకు పడుతూ-

జనాన్ని అదుపులో పెట్టడం పోలీసులకు కష్టంగా వుంది. ఒకర్నొకరు ఒత్తుకుంటూ జనం. . తోసుకుంటూ... భార్యాభర్తలిద్దర్నీ తలమీద కొట్టి చంపిన కిరాతకుడేడి? రాక్షసుడు! ఏడి? ఎక్కడ? అందరికీ కుతూహలం! పట్టలేని ఆందోళన! భయం!

ఏడి? ఎక్కడ? వాడు-

హంతకుడు! డబల్ హత్యలు చేసిన హత్యారా! ఇక్కడ... పోలీసులు అడ్డంగా- ఏమీ కనిపించడంలేదు. ముఖాలు అటుయిటు తిప్పుతూ జనం... ఇసుకవేస్తే రాలని జనం! ఆ వీధిలో అంత జనమా! అందరూ అక్కడే! మగా... ఆడా... పిల్లలు... చంకల్లో పిల్లలు! స్కూళ్ళకూడా పోకుండా పంపేవాళ్ళు లేక అంతా అక్కడే!

హంతకుడేడి ఇంతకూ! ఆతురత! ఉత్కంఠ! భయం! ఇంతలో పోలీసులు జర కొంచెం కదిలారు.

అదిగో హంతకుడు! అమ్మో! వాడే!

ఏడి?

అగో అక్కడ కనపడ్డంలేదా? బక్కగా... పెంటయ్య! కళ్ళు పీక్కుపోయి... కళ్ళచుట్టూ నల్లగా... ఎన్నడూ దువ్వని నెత్తిన వెంట్రుకలు తెల్లగా నల్లగా క్షవరంలేని ముఖం... గడ్డం తెల్లగా... చెంపలు గుంతలైపోయి బొక్కల గూడులా... అదిగో వాడే.


వాడా? చంపాడా? ఎట్లా చంపాడండి! ప్రసాదరావు దంపతులేమో ఇద్దరూ బలంగా వుంటారు. ఇద్దర్నీ వీడెట్లా చంపాడు! ఆ... ఎట్లా చంపగలిగాడు అనీ! తలలు పగులగొట్టాడట! రక్తం కారి మడుగు కట్టిందట!

రక్తం మడుగులో రెండు శవాలు! ఎంత బీభత్సం! వీడెట్లా చేసాడు? ఆశ్చర్యం! భయం!

వీళ్ళు ఎంతకైనా తెగిస్తారు! వీళ్ళ పుట్టుకే అంత! అన్న విశ్వాసముండదు ... ఏదో ఇంట్లో రాత్రి కావలాగా వుంటాడని గేటు దగ్గరి అర్ర... చిన్న అర్ర వుందిట... అది ఇచ్చారు ... అంతే! ఏం కిరాయి లేకుండా వుండమన్నారట! అప్పుడప్పుడు ఇంటి చుట్టు వున్న జాగాను ఊడ్వమన్నారట! లంకంత ఇల్లాయే! చుట్టూ బోలెడు జాగా ! పుణ్యానికి పోతే పాపమై చుట్టుకుంది! ఇంట్లో వుంచుకుంటె ఇంత పని చేస్తాడని ఎవరనుకుంటారు! పుణ్య దంపతులు అందుకే ఒకే రోజు ఒకేసారి పోయారు !

నీతి నియమం... మంచి చెడూ లేకుండా పోతున్నాయి లోకంలో! ... పాప పుణ్యాలు ఎవరిక్కావాలి! డబ్బు... డబ్బు ... దాని మీద ఆశతో ఇంతపని చేసాడు. సొంత వాడిలా చూసుకున్నా విశ్వాసం లేదు. ఆఖరికి ఇంతపని చేసాడు!

అసలు భయం లేకుండా పోతున్నది! ఎంతకైనా తెగిస్తున్నారు. నరకడం! చంపడం! దొంగతనాలు! దోపిడీలు! కిడ్నాపులు... మానభంగాలు ..



ఎన్నాళ్ళ నుంచో తిండి లేనివాడిలా నీరసంగా పెంటయ్య! ... వాడు హంతకుడిలా లేడండి! ... వాడేనా చంపింది! మీకు తెలుసా వాడు? పోలీసులు మధ్య వుండడం చూసి అనుకుంటున్నారా? ఎవరికో సందేహం.

వాడేనండి! ఆ గేటు దగ్గర అర్రలో... చిన్న అర్ర... వాడి పొడుగు లేదు. అందుకే ముడుచుకొని మూటలా పడుకొని వుండగా చూసాన్నేను ...వాడే!

పెంటయ్యా ... హంతకుడా ? అతను చంపడమేమిటి? వాడు ఒకర్ని చంపే వాడులా లేనే లేడు! ఎంత అమాయకంగా వుంది ముఖం! నీరసించి ఎట్లా వున్నాడు? వాడు చంపాడంటారా?

వాడేనండి హంతకుడు! నమ్మకపోతే అటు చూడండి ఎట్లా చంపాడో చూపమని అడుగుతున్నారు. అవునా? వాడెందుకు చంపినట్లు! అయినా వాడికెట్లా చాతనయింది! .. ఆశ్చర్యంగా వుంది ! ... ఇదంతా !...

ఆశ్చర్యమేమీ లేదండి. ప్రసాదరావుకు ఈ ఇల్లేగాక అక్కడా యిక్కడా ప్లాట్లు వున్నాయి. ఓ ప్లాటు అమ్మకానికి పెద్దే అడ్వాన్సు డబ్బు ముప్పైవేలు తెచ్చి అల్మారాలో పెట్టాడట. పెంటయ్య అప్పుడు అక్కడే వున్నాడట... వాడు చూస్తుండగానే నోట్ల కట్టలు అల్మారాలో పెట్టారట!... ఇక నోట్ల కట్టలు చూస్తే ఎవరికైనా పుడ్తుంది రిమ్మ తెగులు! ...

అయినా! ... నోట్ల కట్టలు ఇంట్లో పెట్టుకోవడమేమిటి? ... టైం లేక తెల్లవారి బ్యాంకులో వేద్దామనుకున్నారేమో ...

నిజమే గాని అంత బలంగా వున్నవాళ్ళను యీ బక్కసక్కోడు చంపాడంటె నమ్మడం కష్టంగా వుంది!

ఏం కష్టం లేదు ... బక్కసక్కగ వున్నాడు కాబట్టే కిటికీ చువ్వల్లోంచి దూరి లోపలికి వెళ్ళాడట ... వెళ్ళానని ఇప్పుడే చూపించాడు కూడా ...

అమ్మో ఎంత డేంజరు! ... మా యింట్లోను ఇటువంటి చువ్వలే మార్పించాలి!..

కిటికీలోంచి లోపలికి పోయి ఇద్దరూ పడుకున్న మంచం దగ్గర నిలబడి వరలక్ష్మి మెత్తకిందున్న తాళపు చేతులు తీయబోయాడు! ... అంతే ... వరలక్ష్మి లేచింది. చీకట్లో... ఎవరో ... తెలియక ఎవరు? ఎవరు? అని అరిచిందిట! అంతే! ... మూలలో వున్న కట్టె తీసుకొని తల మీద కొట్టాడు !... ఇంతలో ప్రసాదరావు లేచాడట... అంతే అదే కట్టెతో ఆయన తల మీద కొట్టాడు. అంతే ఇద్దరూ నేల కూలారు.

అబ్బ!... అట్లా కొట్టిన వాడులా... కిరాతకంగా చంపిన దుర్మార్గునిలా అస్సలు కన్పించడం లేదండి వాడు... అబ్బబ్బ! హత్యలు చేసేవాళ్ళు ఎట్లా వుంటారని అనుకుంటున్నారు!... నల్లగా... లావుగా... గళ్ళ లుంగీలతో... బొద్దు మీసాలతో... అనా!... చిరునవ్వులు కురిసాయి.

అవును! వాడు దేంతో చంపాడు? కత్తితో కాదా ! ...వాడు రాత్రి వరలక్ష్మి అల్మారాకు తాళం వేసి తాళపు చేతులు తన మెత్తకింద పెట్టుకోవడం చూసాడట ...

చూసాడని మీకెట్లా తెలుసు !...

వాడు చెప్తున్నాడండి! .. విని వచ్చే చెప్తున్నాను ... చూసాడు గద! ... రాత్రి ... ఏ మూడు గంటలకో వచ్చి ... మెత్తకిందున్న తాళపు చేతులు తీసుకోయాడట...

మీ కెట్లా తెలిసింది ఇదంతా? ... అనుమానంగా మళ్ళా ప్రశ్న.

వాడే... హంతకుడే ... పూనగుచ్చినట్లు అంతా చెప్తుంటే... సరే !... సరే!... తర్వాత - చిరాకుగా ... కుతూహలంగా వాడు తాళపు చేతులు తీసుకుంటున్నాడట మెత్త లేబట్టి... ఇంతలో వరలక్ష్మికి మెలకువ వచ్చింది... ఎవరూ?... ఎవరూ? ... అని అరిచింది. అది విని ప్రసాదరావు లేచాడు ...ఆయన బలంగా బాగా వుంటాడు ... అయినా ఆయన ఇంకా రిటైర్ కాలేదు... ఎంత పయస్సని! ... యాభై యేళ్ళుంటాయేమో... అంతే ...

సరే ! ... లేస్తే ... వీడ్ని పట్టుకోలేదా?


లేవగానే... నిద్రమత్తులో... చీకట్లో... టైమ్ పడ్తుంది ఏమౌతుందో తెలుసుకోడానికి... అంతే అంతలోనే వాడు లాఠీ... అక్కడే అర్రలో... మూలలో వుందట...

లాఠీ... అక్కడెందుకు? వాడికెట్లా తెలుసు - చీకట్లో... లాఠీ అక్కడుందనీ ...మళ్ళీ అనుమానం.

నిజమే! ... అందరి కళ్లల్లో ప్రశ్న.

వాడు ఇంట్లోకి రావడం పోవడం జరుగుతుండేది. ఏ పనికైనా... కాస్తా యీ పరుపు మీద పెట్టరా... పెట్టె కిందికి దించరా... అని అన్నిటికీ ఆ దంపతులు వాన్ని లోపలికి పిలిచే వాళ్ళు...

అంతా నమ్మకంగా నటించాడన్నమాట! ...



అసలు ఆ కఱ్ఱ కొనుక్కొచ్చింది అక్కడ బెడ్రూంలో పెట్టిందీ వాడేనట.

అవునా!.. కండ్లు విప్పార్చి ఆశ్చర్యం.

ఎవరైనా... పిల్లో ... ఎలుకో... దొంగలో వస్తే కొట్టాడానికుంటుందని వాళ్ళ ఆత్మరక్షణ కోసం వాడే కొనుక్కొచ్చి మూలలో పెట్టాడట...

దాంతోనే వాడు! ... ఆశ్చర్యం! భయం!

ఆ ... ఆ కఱ్ఱతోనే వాడు వాళ్ళ తలల మీద కొట్టాడు.

ఒక్క దెబ్బకే తల పగిలి ఒక్కరొక్కరూ... ఇద్దరూ... ఏకంగా నేల కొరిగిపోయారు... వాడేమో తాళపు చేతులు మెత్త కింది నుంచి తీసుకొని పారిపోయాడు... డబ్బు మొత్తం ... ముప్ఫైవేలు... తీసుకొని పారిపోయాడు ...

ఎక్కడికి పారిపోయాడంట!... ఏ బొంబాయికే పోయివుంటాడు... జల్సా చేసుకోవడానికి... కసిగా ప్రశ్న...జవాబు.

ఆ....అంత సీనా వాడికి... పోలీసులు హత్యలు జరిగిన ఇంట్లో పెంటయ్య మాయమయ్యాడని తెలుసుకొని వెంటనే వాడి ఊరికి పోయారట!...

పోతే... వున్నాడా అక్కడ? వాడికింత మాత్రం తెలియదా వాడిని వెతుక్కుంటూ పోలీసులు అక్కడికి వస్తారని?

ఆ... వాడికంత తెలివా!... పోలీసులు వాడి ఊరికి... ఇంటికి... అదే గుడిసెకు... పోయేసరికి ... అదో ... ఆ భుజం మీద వుందే... ఆ పంచెలో నోట్ల కట్టలు పోసుకొని కూర్చొని వున్నాడట... భార్యా పిల్లలూ చుట్టూ వున్నారట...

ఏం జేసుకుందామనుకున్నాడో... పోలీసులు వెతుక్కుంటూ రారనుకున్నాడా!... ఏం కలికాలమండి!... ఆశ్చర్యం ! కోపం!

ఆ డబ్బులో అప్పు తీర్చాలనుకున్నాడట... బోరు వేయించుకొని వ్యవసాయం చేసుకుందామనుకున్నాడట... ఈ రిక్షా తొక్కే బాధ తప్పుతుందనుకున్నాడట... ఇంకొకరి డబ్బుతో మజా చేద్దామనుకున్నాడు ... వాడు అప్పులు చేసి... పైగా ... దొంగతనం! ...

అది కాదండీ !... ఆ డబ్బును వాళ్ళు అడిగితే ఇవ్వరని... పంట పండాక ధాన్యం అమ్మి ఆ డబ్బు మళ్ళీ తెచ్చి వాళ్ళకిద్దామని అనుకున్నాడట!... పాపం! ...

అదేమిటీ! హంతకున్ని పాపం! ... అంటున్నారు!... ఇదెక్కడి కాలమండి! ...

హాఁ... అట్లా కాదు. వాడు చంపాలనే ఉద్దేశంతో ఇంట్లోకి పోతే కదా! ... ఆ డబ్బు తీసుకొని ఊరికి వెళ్లిపోదామనుకున్నాడట! ...

అరే! ... పుణ్యానికి వచ్చిన డబ్బు తీసుకొని పోదామనుకున్నాడా!... అదే! దొంగతనానికి పూనుకున్నాడు... అసలు వాడికి కిరాయి లేకుండా అఱ్ఱ యిచ్చీ పుణ్యానికి పోయి పావం కొని తెచ్చుకున్నారు ఆ దంపతులు!...

అది కాదండి! ...

ఏది కాదండి! ...మీరైన్నైన చెప్పండి యీ కాలంలో ఒకడ్ని పాపం అంటే పామై చుట్టుకుంటున్నది... ఇదిగో ఇట్లాగే ...

పాపం! వాడు ...

అదిగో మళ్ళా పాపం! ... హంతకున్ని - అదీ డబల్ హత్యలు చేసిన వాడ్ని పాపమా! పాపం! ... ఏమిటండి!...

కాదు! ... ఆ చిన్న అఱ్ఱలో చీకట్లో ... మూటలా ముడుచుకొని పండుకుంటె... వాడికనిపించేదట ... అంత పెద్ద బంగ్ల వాళ్ళిద్దరికి... నేనేంది యీ చాలీ చాలని అఱ్ఱలో ... ఈ ఆలోచనలతో వడుకునేవాడట! ... ముప్ఫైవేలు వాడి ముందే కద ఇచ్చింది ... వాళ్ళు అల్మారాలో పెట్టిందీ ... ఆ రాత్రి వాడి కండ్లముందు ఆ ముప్పై వేలే కన్పించాయట! ... ఒక వైపు ఆకలి మండుతోంది! ... ఇంకోవైపు ముప్ఫైవేలు కన్పిస్తున్నాయి...

మనిషి ఆశకు అంతు లేదండి!... రిక్షా లాగే వాడికి అప్పు ఏమిటి!... భూమి ఏమిటి!... బోరు వేయించుకొని పంట పండించాలనే ఆశ ఏమిటి!... ఆశతో మనిషి దేనికైనా తెగిస్తాడు!.... నాకే భూమి వుంటే యీ నౌకరీ గీకరీ... ఊడిగం... దొర... దేశముఖ్ లాంటి బాసును ఒదిలిపెట్టి... హాయిగా... స్వతంత్రంగా... వ్యవసాయం... పండిస్తూ బతికేవాడిని...

అందుకని యీ హత్యలు చేసాడా?... కోపం -భరించలేని కోపం.

హత్యలు వాడు చేద్దామనుకోలేదు ... ఆకలి!... వరలక్ష్మిని ఇంత అన్నం పెట్టమ్మ అని అడిగాడట... నీకు ఇంట్లో పుణ్యానికి అఱ్ఱ యిచ్చింది కాక అన్నం కూడా పెట్టాలా!... అని కోప్పడిందట...

కోప్పడితే హత్యా! ...

అది కాదండి వాడు రిక్షా కిరాయిలు దొరకక మూడు రోజుల నుంచి ఉపవాసముంటున్నాడట!... ఆకలి! ... ఆకలితో మనిషి ఎంతకైనా తెగిస్తాడు!... మరి!...

వాళ్ళకంత బంగ్ల- నాకు చిన్న అఱ్ఱ- వాళ్ళకంత డబ్బు!... అని ఆలోచనలతో వాడు హత్యకు దిగుతాడా! ఎంత పాపకాలం వచ్చిందండి. పూర్వ జన్మసుకృతం- వాళ్ళు అనుభవిస్తున్నారు. వీడేం పాపాలు చేసి పుట్టాడో... ఇట్లా తిండి లేక చస్తున్నాడు... ఆ మాత్రం తెలియదా!... వాడికి. మళ్ళా పాపం చేసాడు... యీ జన్మలోనూ ...మళ్ళా జన్మలో ఏమై పుట్తాడో... ఛీ! ఛీ! మీరేమైన చెప్పండి మానవత్వం నశిస్తున్నది. పాపపుణ్యాల భీతి లేకుండా పోతున్నది. ఈర్ష్య అసూయలు! ... ఒకడు పచ్చగా వుంటె ఓర్వలేని తనం! ...ఇదిగో... వాటితోటే యీ హత్యలు!...

మీరు మరీ!... ఎక్కడికో పాప పుణ్యాలు జన్మల దగ్గరికి వెళ్లిపోయారు. ఆ డబ్బు వాడు [illegible] మళ్ళా పంట పండాక తెచ్చియిద్దామనుకున్నాడటండీ!... ఇది మొత్తం వాళ్ళ అబ్బాయికి అమెరికాలో వచ్చే నెల జీతంలో ఓ మూల కాదు!.. యీ డబ్బు తీసుకుంటె ఏమైతది అనుకున్నాడటండీ! ...

అంటె వాళ్ళబ్బాయి అమెరికాలో వున్నాడనీ వాడికి తెలుసన్నమాట! ..

తెలుసు వాడికన్నీ తెలుసు! వరలక్ష్మి అన్నీ వాడికి చెప్పుకునేదట. కాని ఒక్క అన్నపు మెతుకు మాత్రం విదిలించేది కాదట!... ఇదీ వాడి మాటేనా ! ...

అవును ... వాడదే చెప్తున్నాడక్కడ పోలీసులకు...

అందరి కళ్ళు అటు తిరిగాయి.

అటు ఇటు పోలీసులు! మధ్య పెంటయ్య! ... పారిపోకుండా అతని కాళ్ళకు చేతులకు లావుగా బలంగా ఇనుప గొలుసులు! మౌనంగా కడుపు వీపునంటుకొని పోయి ... కండ్లల్లో అమాయకత్వం ... అలసట!...

వాడ్ని చూస్తే ... ఇదంతా చేసింది వాడే అని నమ్మ బుద్ధి కావడం లేదు!... అనుమానంగా....

మళ్ళీ మొదటికి వచ్చారు!

మనిషి ఆశకు అంతు లేదండి! ... రిక్షా లాగే వాడికి అప్పు ఏమిటి! ... భూమి ఏమిటి! ... బోరు వేయించుకొని పంట పండించాలనే ఆశ ఏమిటి! ... ఆశతో మనిషి దేనికైనా తెగిస్తాడు! ....

నాకే భూమి వుంటే యీ నౌకరీ గీకరీ... ఊడిగం... దొర... దేశముఖ్ లాంటి బానును ఒదిలిపెట్టి... హాయిగా... స్వతంత్రంగా... వ్యవసాయం... పండిస్తూ బతికేవాడిని...

ఆఁ ... బతుకుతావు!... వ్యవసాయంలో ఎన్ని కష్టాలున్నాయే యీ పట్నంలో వున్న ... రోజూ కడుపు నిండా మెక్కి ... బస్సులో పోయి... ఫ్యాను కింద ఆఫీసులో... గంట గంటకు చాయ్... కాఫీ... టిఫిన్లు... పాన్‌లు నీకేం తెలుసు! ... వానల్లేక ... విత్తనాలు పిరమై... కరెంటు లేక ... చెక్కలాగ గట్టిపడ్డ భూమి తల్లిని నాగలి పట్టి ఒక్కరోజు పెకలిస్తే ... ఆహాఁ (నవ్వు) ... ఆ పొట్టంతా కరిగిపోతుంది... ఆహాఁ పార్కుల్లో వాకింగులు ... జాగింగులు... ఆహాఁ అక్కరుండదు...

సరే లేవోయ్!... రిక్షా వాడికి భూమి వున్నంక యీ పట్నం రావడమేమిటి!... యీ డబల్ మర్డర్లేమిటి ... అంతా ... ఘోరకలి!... ఎక్కడున్న వాళ్ళు అక్కడుండక...అదిగాదోయ్!... ఇక్కడికి పట్నం వస్తారా!... యీ బిల్డింగులు... నోట్ల కట్టలు... అవన్నీ చూసేసరికి ...వాళ్ళకు మంట మొదలవుతుంది. దాంతో కండ్లు మండించుకొని ... యీ దోపిడీలు... మర్డర్లు... పుణ్యానికి డబ్బు ... దస్కం... సంపాయించడానికి... యీ మార్గం... పోలీసులుంటారు... పట్టుపడ్తాం! అన్న జ్ఞానం నశిస్తుంది... డబ్బు!... డబ్బు!... అదే కన్పిస్తుంది కండ్ల ముందల...

ఏమో!... ఒక్కసారి ఆకలితో వుంటే తెలుస్తుంది నీకు ... అయితే!... ఆకలికి తట్టుకో లేకపోతే మర్డర్లా!... మీరు... మరీ విచిత్రంగా చెప్తున్నారు. వాడు కిరాతకుడండి!... డబ్బు కోసం ఎంతకైనా తెగిస్తాడు... ఎంత క్రౌర్యానికైనా వెనుకముందాడడు!... నేరం చేయడం ఒక లెక్క కాదు వాడికి....

అదిగాదండి ఇక్కడ డబ్బు ముఖ్యంగాదు... ముందుగా ఆకలి!... ఆకలి!...

ఆకలా!... డబ్బు ఆకలా!... ఆహాఁ (నవ్వు)

డబ్బు వుంటె ఆకలి ఎక్కడిది!... డబ్బు లేకనే ఆకలి!... వాడి కడుపు నిండితే ఆకలి ఎక్కడిది! ఇరుకు అర్రలో... ఆకలితో ... నిద్ర పట్టక... పేగులు గుర్రు గుర్రు మంటుంటె ... ఏమనుకున్నాడో... లేచాడు... ఇంట్లో జొరబడ్డాడు.

హత్యలు చేసాడు!... అంతేనా మీరనేది.

హత్యలు చేయడానికి వెళ్ళలేదండి... పాపం... ఆ డబ్బు తీసుకొని పోయి... మళ్ళా ఇద్దామనుకున్నాడట!... అంత డబ్బు వాడెట్లా వాపసు ఇస్తాడండీ!... కూడబెట్టి కూడబెట్టి ఎప్పుడిస్తాడండి....మీరు... కమ్యూనిస్టులా!...



ఆహాఁ... ఆహాఁ... (నవ్వులు)

లే...దు... కాదండి!...వాడు చెప్పిన మాటలు విని నేను చెప్తున్నాను...

అట్లా కాదు ... మీ మాటల్లో సానుభూతి కన్పిస్తుంటె ... సానుభూతా!... అది కాదండి పక్కనే పెద్ద బంగ్లా... కడుపు నిండా తిని పడుకున్నారు.... వీడు పస్తులతో... చాలీచాలని ఇరుకు అర్రలో....

అట్లా అని మర్డర్లు చేయాలా!... ఎవరు ఎంత రాసుకొని తెచ్చుకుంటె అంత అనుభవిస్తారని నోరు మూసుకొని పడివుండాలి! ...

మీరు చెప్పేది బాగుందండి!... మనిషికి ఆలోచన వుంటుంది. మనస్సు వుంటుంది. ఎట్లా పడి వుంటాడు!... ఆకలితో పేగులు గుర్రు గుర్రుమంటుంటే...

ఆకలేస్తే మనమున్నాం కదండి వీధిలో ... ఎవర్నైనా ఇంత అన్నం పెట్టండీ... అని అడిగాడా? అడిగితే పెట్టే వాళ్ళంగద! ... ఈ డబల్ మర్డర్లు!... అబ్బబ్బ!...భద్రత ఎక్కడుంది యీ సమాజంలో... అయినా మన వీధిలో ఇంత ఘోరం జరిగిందంటే నమ్మలేకుండా వున్నాను... మనమంతా జాగ్రత్తగా వుండాలి!... పోలీసు పారా అడగాలి!... మనమూ బీదా బిక్కీ అంటూ ఎవర్ని పడితే వాళ్లను ఇంట్లో పెట్టుకోవడం మానెయ్యాలి!...

మరి ఇంట్లో పనులెవ్వరు చేస్తారండి!... ఇంతంత పెద్ద ఇండ్లు మార్బుల్లు వేసుకొని కట్టుకున్నాం... అవన్నీ ఎవరు ఊడ్వాలి! తుడ్వాలి!... అవి రోజూ తుడువకపోతే మాసిపోయి ... తళతళమని వుండవు!... ఏదో వాడు అప్పు తీర్చుకోవాలి... బోరు వేసుకోవాలి అని అట్లా చేసాడు అందరూ చేస్తారా? ...

ఏమిటో అండి! హత్య! డబల్ హత్యలు!... మీరూ నేనూ చేయగల్గుతామా! అట్లా బిచ్చమెత్తుకోనైనా బతుకాలి గాని యీ విధంగా చంపడం! రక్తపాతం!... బాబోయ్!...

తల పగిలి పోతుందండి!... రక్తం ... ఎర్రని రక్తం బొట్టును చూస్తేనే నాకు ఒళ్ళు తిరుగుతుంది.... తలలో చక్కరు ... వస్తుంది... మొన్న డాక్టరు రక్త పరీక్ష చేయించుకోమంటే డయాగ్నిస్టిక్ సెంటర్‌కు పోయాను... అక్కడ... వాడు సన్నని సూదిబెట్టి బొటన వేలు మీద కసుక్కున పొడిచాడు... ఎర్రని రక్తం పొంగుకొని వచ్చింది... దాన్ని చూస్తేనే నాకు కండ్లు తిరిగి మూసుకుపోయాయండి!... అటువంటిది... వీడు ఇద్దర్ని హత్య చేసాడంటే... అమ్మో!... సామాన్యుడు కాదు!... ఏది ఏమైనా మన వీధి వాళ్ళమంతా జాగ్రత్తగా వుండాలి!...

పాపం!.. వాడ్ని పోలీసులు తీసుకుపోతున్నారు!...

తీసుకపోతే... మీకెందుకండి బాధ!...

అందరి చూపులు పోలీసుల మధ్య గొలుసులతో బంధించిన పెంటయ్య మీద!... ఆకలితో... బాధతో... నీరసంగా... భారంగా... నడవడానికి శక్తిలేదు. నడవలేక పోతున్నాడు. పోలీసులే అతన్ని ముందుకు తోస్తున్నారు. పెంటయ్య చెవుల్లో గాలి... పొరలుగా... తరంగాలుగా... ఏవో శబ్దతరంగాలు!...

పెంటయ్యకు దుఃఖం ఉప్పొంగుకొని వచ్చింది. కాని ఏడ్పు రావడం లేదు బయటికి... రాని దు:ఖం అతని కండ్లను ఎర్రగా చేసింది... కుంకుమ పువ్వు పోసినట్లుగా అతని కండ్లు!...

అమ్మగారూ!... ఆకలయితుంది. గింత అన్నముంటే ఎయ్యండ్రి... అని ప్రాధేయపడింది ఇక్కడ్నే!

పెంటయ్య చూపులు వరండాలోకి పాకాయి. కేన్ కుర్చీలో... ఫ్యాను కింద వరలక్ష్మి...

బాగుంది వరస! ఇంట్లో అర్ర ఇచ్చింది కాక అన్నం పెట్టమంటె ఎక్కడ్నుంచి వస్తుంది... ఉఫ్!... గాలి లేదు... ఉడుకపోత!... కాస్త ఫ్యాను గట్టిగా తిప్పరా!... అదిగో రెగ్యులేటరు!...

అందరి చూపులు పోలీసుల మధ్య గొలుసులతో బంధించిన పెంటయ్య మీద!... ఆకలితో... బాధతో... నీరసంగా... భారంగా... నడవడానికి శక్తిలేదు. నడవలేక పోతున్నాడు. పోలీసులే అతన్ని ముందుకు తోస్తున్నారు. పెంటయ్య చెవుల్లో గాలి... పొరలుగా... తరంగాలుగా... ఏవో శబ్ద తరంగాలు!...

ఎంత చెమట వరలక్ష్మికి!... రిక్ష తొక్కుతు ఎండల తిర్గుతున్న తనకు చెమట చుక్క లేదు!...

అయ్యగారు!...

ఆఫీసుకు పోవద్దా... భోంచేసి వెళ్లి పోయారు... వరలక్ష్మి కడుపునిండా భోంచేసి ఫ్యాను కింద ... చెమటలతో తడిసి ....

అయ్యగారు.... భోంచేసి- ఆఫీసుకు - ఫ్యాను కింద కనుకుపాట్లు! ...

నా కొడుక్కు అమెరికాలో ఎంత జీతమో తెలుసా?

వరలక్ష్మి మాటలు పెంటయ్య చెవుల్లో గిరగిర తిరిగాయి. నాకేం ఎర్క...

ఆరు లక్షలు ...

లక్ష అంటే .. ఏమో ... ఎంతో...

అంటే నెలకు వెయ్యి వుంటుందంటర!...

హో!... పెద్ద నవ్వు. చెవులు పగిలి పోతున్నాయి. నీ బొంద! నెలకు ఆరు లక్షలు రా! ...

పాపం!...ఎంత కష్టం చేస్తడో... గంత జీతం!... మనకేమైనా పంపుతడ? ...

మనకెందుకురా! ... నీ వెర్రిగాని... మనకే బోలెడు...

అయ్యగారి జీతం!... మీది సంపాదన... ఏం బంగారం కొనుక్కొని తింటరు?

హో!... నవ్వు.

అయ్యగారే! అన్నీ అమ్మి రిటైరయినంక ఏ బాదర బంది లేకుండ వుండాలని ... ప్లాటు అమ్మారు!... నువ్వు చూసావు గద!... ముప్పై వేలు అడ్వాన్సు ఇచ్చి వెళ్ళారు! ...

అమ్మ! గింత అన్నం ...

మళ్ళీ మొదటికొచ్చింది బేరం - వండుకు పో! ...

పైన లేదమ్మ చేతిల - రిచ్చ బేరం అయితే లేదు నాలుగు రోజుల బట్టి ... ప్రార్థనా తరంగాలు....

ఏదో సాయంగ వుంటావని పెట్టుకుంటె... తిండి కూడా పెట్టమంటె ఎట్లా?... ఎక్కడ్నుంచి తేను ? ... ఇదో రెండు రూపాయలు!...తీసుకెళ్ళి బయట తిను పో!...రెండు రూపాయలు !... చా బొట్టు కూడా రాలేదు!...

పెంటయ్యకు ఆకలి!...ముదనష్టపు రోగం!... ఆకలి!...

దేవుడెందుకు పెట్టిండో యీ పొట్ట!... మళ్ళీ చెవుల్లో గాలి పొరలు... దాన ధర్మాలు చేసుకుంటే మళ్ళీ మనిషి జన్మ దొరుకుతుందట! స్వాములవారు చెప్పారు. అందుకే అయ్యగారు ప్రతియేటా స్వాములవారి నిధిలో డబ్బు వేస్తున్నారు!...నువ్వూ పుణ్యకార్యం చేయరా!... వరలక్ష్మి మాటలు ... పెంటయ్య చెవుల్లో సుడులు సుడులుగా ...

పుణ్య కార్యమా? అంటే? - ముందు యీ ఆకలి తీరితే బాగుండును!... తీరని ఆకలితో... అర్రలో ముడుచుకొని పడుకుంటె బంగ్ల... ఆరు లక్షల జీతం... బెడ్రూంలో అల్మారాలో ముప్పైవేలు!... ఇవే ఆలోచనలు!

అమెరికాలో వున్న ఒక్క కొడుకు ఒక్క రోజు జీతం కాదు ! ... అర్ధరాత్రి... ఆలోచనలతో లేచాడు పెంటయ్య... బంగ్లవైపు నడిచాడు.

ఎంత బద్మాష్ వాడు! దుర్మార్గుడా!... రెండు హత్యలు చేసి ఎట్లా వున్నాడు!... అమాయకుడిగా...

వాడికి ఉరిశిక్ష పడాలండి!...

పాపం! ... వాడి భార్యా పిల్లలు!...

మీరు పాపం అనొద్దు!... శిక్షల్లేక అన్యాయాలెక్కువై పోతున్నాయి!... జనం నేరాలకు ఎగబడ్తున్నారు!

ఎత్తైన పెంటయ్య బొక్కల గూడులా కదిలాడు... అటు యిటు... వెనుకా ముందూ పోలీసులు... గొలుసులు ఖణఖణలు!

పెంటయ్య నిశ్శబ్దంగా... ఊర్లె భార్యా పిల్లలు అన్నం తిన్నారో లేదో... ఆలోచనలతో... పైకి రాని దుఃఖంతో సింధూరం చల్లినట్లుగా ఎర్రబడిన కండ్లు!

వాడి కండ్లు చూడండి!... ఎట్లా ఎర్రగా భయంకరంగా వున్నాయో!...వాడి ముఖంలో ఏమన్నా సిగ్గూ లజ్జా... పశ్చాత్తాపం ... కన్పిస్తున్నాయా!...

మిట్ట మధ్యాహ్నం!... ఎర్రటి మండే ఎండలో జనం!... కదలకుండా ... పనులకు పోకుండా... గుంపులు గుంపులుగా... భయం! ఆందోళనలతో!... కలవరపడుతూ...

●


| | | |
|---|---|---|
| 6 | 11 | 4 |
| 5 | 7 | 9 |
| 10 | 3 | 8 |

ఎవరు కోటీశ్వరులవుతారు?
(ఎంట్రీఫీజులేదు)

| | | |
|---|---|---|
| | | 5 |
| | 8 | |
| 11 | | |



**ప్రత్యేక అవార్డు :** మారుతికారు 800సిసి, మోటారు సైకిలు, చేతక్ స్కూటర్, కలర్ టివి, ఫ్రిజ్, ఎయిర్ - కూలర్, వాషింగ్‌మెషిన్, **సంతృప్తికరమైన బహుమతి :** కెమేరా, టు-ఇన్-వన్, ఫాన్స్, గోల్డ్‌చైన్, చీరలు, రిస్ట్ వాచ్ MB&HP సిస్టం కింద ఇవ్వబడతాయి.

శాంపిల్ ప్రకారం 9 ఖాళీ చతురస్రాకారం గీయండి. 5 నుంచి 13 అంకెలు వాడుతూ ఎటుకూడినా 27 వచ్చేలా చూడండి. ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. మీ ఎంట్రీని పోస్టుకార్డు/ఇన్‌లాండ్/ ఎన్వలప్ పై ఆర్డినరి పోస్టుద్వారా 10 రోజుల్లోగా పంపండి. మొదటి 20 ఎంట్రీలకు 10 గ్రాముల బంగారు నాణెం ఇవ్వబడుతుంది. (భారత ప్రభుత్వం క్రింద నమోదైనది)

**Add: RAJ GROUPS (T/10) P.O. ARARIYA R.S.-854 312**

The publication will not be held responsibble for any kind of dispute.